
ఈనాడు జగిత్యాల

ఇంటి దొంగలు

కొండగట్టు ఆలయంలో ఉద్యోగుల చేతివాటం



అంజన్న ఆలయం

న్యూస్‌టుడే, మల్యాల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఇంటి దొంగలు చేతివాటం చూపుతున్నారు. ఆలయానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివచ్చి తమ శక్తికొద్దీ కానుకలు సమర్పిస్తుంటారు. ఆలయ సిబ్బందిలో కొందరు కానుకలు, సరకులను మాయం చేస్తూ స్వామివారికే శఠగోపం పెడుతున్నారు. తాజాగా ఆలయ నిత్యాన్నదాన సత్రంలో పనిచేసే జూనియర్ సహాయకులు రాములు బియ్యం బస్తాలతోపాటు ఇతర సరకులు మాయం చేసినట్లు అధికారుల విచారణలో తేలడంతో మెమో జారీ చేసిన విషయం విదితమే.

కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లో భక్తుల కదలికలు, సిబ్బంది పనితీరుపై నిఘా వేయడానికి దాదాపు 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పోలీసు ఔట్‌పోస్టులో రక్షణ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. అయినప్పటికీ తరచూ అక్రమాలు, చోరీలు జరగడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

■ ఆరు నెలల కిందట శ్రీనివాసచారి అనే సీనియర్ సహాయకుడు దుకాణాల టెండరు లీజుకు సంబంధించి రూ.52 లక్షలను పలువురు వ్యాపారుల నుంచి వసూలు చేసి ఆలయ ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో అతడిని సస్పెండ్ చేయడంతోపాటు ఈవో ఫిర్యాదు మేరకు మల్యాల ఠాణాలో కేసు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఈవోను సస్పెండ్ చేయగా మరో ఇద్దరు సూపరింటెండెంట్లకు మెమోలు జారీ చేశారు. సీనియర్ సహాయకుడు ఆలయ నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు 8 నెలల తర్వాత గుర్తించడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

■ దాదాపు ఐదు నెలల కిందట ప్రసాదం తయారీ కేంద్రంలో 20 ఏళ్లుగా పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హుండీ లెక్కింపు సమయంలో రూ.11,010 తస్కరించి పట్టుబడటంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

■ దాదాపు ఏడాది కిందట ఆలయ పాలకవర్గంలోని ప్రముఖ వ్యక్తి హుండీ లెక్కింపు సమయంలో బంగారు ఆభరణం తస్కరించినట్లు సీసీ కెమెరాలో నమోదు కావడంతో స్థానిక నాయకులు దేవాదాయశాఖ కమిషనరుకు ఫిర్యాదు చేయడంతో అతడిని పదవి నుంచి సస్పెండ్ చేసినప్పటికీ కోర్టు స్టే ఉత్తర్వుల ద్వారా కొనసాగుతున్నారు.

■ జయంతి ఉత్సవాల సమయంలో చేయని పనులకు ఇంజినీరింగు విభాగంలో కొందరు అధికారులు రూ.లక్షల్లో ఆలయ నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. గతంలో పలు రకాల ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను కూడా రీఇష్యూ చేసిన సంఘటనలున్నాయి. కొండపైన జరిగే పలు టెండర్లలో నాయకులు, గుత్తేదార్లు కుమ్మక్కై అంజన్న సొమ్మును కాజేస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా సిబ్బంది తీరు మారడంలేదు. కొండగట్టులో ఇంటి దొంగల ఆటకట్టించి ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు - రామకృష్ణారావు, ఈవో

కొండగట్టు ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అక్రమాలు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడి ఉద్యోగులు పనిచేయాలి. అన్నదాన సత్రంలో బియ్యం, సరకులు మాయం చేసిన జూనియర్ సహాయకుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెన్షన్ కూడా చేస్తాం. కొండగట్టులో ఆయా విభాగాల సిబ్బంది పనితీరుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

నేడు రైతునేస్తం కార్యక్రమం

జగిత్యాల వ్యవసాయం: జిల్లాలోని మండలానికొక రైతువేదికలో ఈ నెల 15న ఉదయం 10 గంటలనుంచి రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఏవో తెలిపారు. వివిధ ప్రాంతాల్లోని శాస్త్రవేత్తలు, అధికారులు పంటలసాగుపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా వివరిస్తారన్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పంచాయతీల్లో అందని అంతర్జాల సేవలు

నిరుపయోగంగా ఫైబర్ తీగలు.. యంత్రాలు



సారంగాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఫైబర్ నెట్ పరికరాలు

న్యూస్‌టుడే, సారంగాపూర్

గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సేవలు అందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం 2017లో శ్రీకారం చుట్టిన టీ ఫైబర్ కార్యక్రమం నీరుగారిపోతోంది. గ్రామాల్లో అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు, ఖర్చు, పంచాయతీ సిబ్బంది జీత భత్యాలు, ఆదాయవ్యయాలు, ధ్రువీకరణ పత్రాల జారీ వంటివి డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకరావాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. దీంతో పల్లెల్లో ప్రభుత్వ నిధుల వినియోగంపై పారదర్శకత ఏర్పడి.. కాగిత రహిత అందుతాయని భావించారు. కానీ ప్రభుత్వం మారిన గ్రామీణుల ఆశ నెరవేరలేదు. గత భారాస ప్రభుత్వం మండలం నుంచి ప్రతీ పంచాయతీకి అనుసంధానం చేస్తూ ఫైబర్ నెట్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. జిల్లాలోని 380 పంచాయతీలకు రూ.లక్షల ఖర్చుతో మిషన్ భగీరథ పైపులైన్‌తో సహా టీ ఫైబర్ కేబుళ్లు వేశారు. సంబంధిత యంత్రాలను సైతం సమకూర్చారు. కానీ అంతర్జాలం సౌకర్యం కల్పించడంలో మాత్రం జాప్యం చేస్తుండటంతో యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

మాయమైన కంప్యూటర్లు

జిల్లాలో అత్యధికంగా జనాభా ఉన్న పంచాయతీలకు 2015లో అప్పటి ప్రభుత్వం కంప్యూటర్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేసింది. అయితే ప్రస్తుతం మేజర్ పంచాయతీలు మినహా ఎక్కడా అవి వినియోగంలో లేవు. ఆపరేటర్లను నియమించకపోవడంతో వినియోగించక పాడయ్యాయి. పంచాయతీ సిబ్బంది పన్నులు, ఇతర సేవలకు రుసుము చెల్లిస్తున్న వారికి చేతిరాతతో రాసిన రసీదులే ఇస్తున్నారు. ఇందులో ఎంత మొత్తం గ్రామ పంచాయతీ ఖాతాకు చేరుతుందన్నది ప్రశ్నార్థకం. ప్రస్తుత ప్రభుత్వం ఫైబర్ నెట్ ద్వారా గ్రామాలకు అంతర్జాల సౌకర్యం కల్పించడంపై దృష్టిపెట్టాలి.

ఆన్‌లైన్ రసీదులతో పారదర్శకత

ప్రభుత్వ నిధులు, పన్నుల చెల్లింపుల్లో పారదర్శకత ఆన్‌లైన్ సేవలతోనే సాధ్యం. గతంలో అందించిన కంప్యూటర్లు మూలన పడేయగా, ప్రస్తుతం ఫైబర్ నెట్ సేవలు ఇప్పటికీ ప్రారంభం కావడంలేదు. ఆధునిక సాంకేతికత పెరుగుతున్నా పంచాయతీ సేవలు మాత్రం అందుకు తగ్గట్టు మారడం లేదు. **- అభిలాష్, నర్సింహులపల్లె**

ప్రజావాణికి 22 వినతులు

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రజావాణి వినతులకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతం రెడ్డితో కలిసి ప్రజల సమస్యలు విన్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వస్తారని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిశీలించాలన్నారు. ఈ సందర్భంగా 22 వినతులు రాగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖలకు రాశారు. ఆర్డీవోలు పి.మధుసూదన్, ఎన్.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో పి.హన్మంతరావు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్లు

మందుబాబులతో ఇబ్బందులు



జగిత్యాల అంగడిబజార్ చుట్టుపక్కల వీధుల్లో మందుబాబులతో ఇబ్బందులెదురవుతున్నాయని రాధాక్రిష్ణా రెసిడెన్సీ వాసులు ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఇళ్ల మధ్యలో బార్ అండ్ రెస్టారెంట్ ఉండడం అర్ధరాత్రి వరకు బహిరంగంగా మద్యం తాగి రహదారిపైనే మూత్రవిసర్జన చేస్తున్నారని మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిరోజు మందుబాబులు కాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలి

కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లి శివారు సర్వే నంబర్ 114లో ప్రభుత్వ భూమిని ముత్యంపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆ సర్వే నంబర్‌లో గ్రామంలోని పేదలకు పట్టాలు ఇవ్వగా కొందరు సాగుచేసుకుంటుండగా కొందరు సాగుచేయడం లేదన్నారు. నాలుగేళ్ల కిందట కొంతభూమిని ముత్యంపేట గ్రామానికి చెందిన వారు ఆక్రమించి సాగు చేస్తున్నారని కొండగట్టు ఆంజనేయస్వామి అశోకవనానికి వెళ్లే దారిని సైతం ఆక్రమించారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని పేదలకైనా ఇవ్వాలని కోరారు. గ్రామంలో ఓ వ్యక్తి కాలువను కూల్చివేసి కబ్జా చేసి ఫెన్సింగ్ పెట్టుకున్నాడని నిర్మాణం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.



వనరులు పుష్కలం పరిశ్రమల స్థాపనకు అనుకూలం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధిపై ఆశలు

ఈనాడు, కరీంనగర్



రాష్ట్ర ప్రభుత్వం 24 భారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించడంతో.. వాటి స్థాపనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అనుకూలమనే మాట అందరినోట వినిపిస్తోంది. ఇప్పటికే పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఉమ్మడి జిల్లాకు మంచి గుర్తింపు లభిస్తోంది. పైగా పరిశ్రమలశాఖ మంత్రి జిల్లాకు చెందినవారవడం అదనపు బలం. రవాణా, మార్కెటింగ్ కోసం రోడ్డు, రైలు మార్గాలు, నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో నాలుగు జిల్లాల్లో పారిశ్రామిక వికాసం వెల్లివిరియాలనే ఆకాంక్ష క్రమంగా పెరుగుతోంది.


ఈ ప్రభుత్వంలోనైనా సాధ్యపడేనా..

గత ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల్ని ఏర్పాటు చేస్తామని.. జగిత్యాల జిల్లా వెల్గటూర్, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి, గంభీరావుపేట్, కరీంనగర్ గ్రామీణ మండలాల్లో పలు ప్రాంతాలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపినా.. అచరణలో సాధ్యపడలేదు. ప్రస్తుత ప్రభుత్వమూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికుల్ని ఆహ్వానిస్తోంది. ఇప్పటి వరకు 86,552 అనుమతి పొందగా.. మరో 15వేల దరఖాస్తులు ఈ వార్షిక సంవత్సరంలో అందే వీలుంది.

తోడ్పాటు అందిస్తూ..

● టీజీఐఐసీ ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పారిశ్రామికవాడలను గతంలోనే గుర్తించారు. వీటి పరిధిలో దాదాపుగా 3వేల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. కరీంనగర్‌లోని పద్మానగర్‌లాంటి చోట సౌకర్యాల్ని మెరుగుపరచాల్సి ఉంది.

● తోలు ఉత్పత్తి సముదాయాన్ని(లెదర్‌పార్క్) చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన పదిహేనేళ్లుగా నానుతోంది. 135 ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచినా.. ఇప్పటికీ ఇక్కడ పురోగతి లేనే లేదు. ఇందులోని 100 ఎకరాల్లో బెటాలియన్ ఏర్పాటు చేశారు. మిగతా స్థలం అలాగే ఉంది. నాలుగు జిల్లాల్లో దాదాపుగా 64 పరిశ్రమలు గతంలో ప్రతిపాదనలు పెట్టుకున్న వాటి పునరుద్ధరణకు తోడ్పాటు అందాల్సి ఉంది.



ఘనమైన ఫలితాలు..

● 256 కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు, మరో 300కిపైగా గ్రానైట్ క్వారీలు ఏర్పాటైన జిల్లాలో వేలాదిమందికి ఉపాధిని అందిస్తోంది. రాష్ట్రానికి గనుల ద్వారా అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే ప్రాంతంగా పేరొచ్చింది.



● సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) 2023-24లో 70.02 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇందులో గోదావరిఖని ప్రాంతంలోని కార్మికుల శ్రమ గణనీయంగా ప్రతి ఏడాది కనిపిస్తోంది.

ఎంఎస్‌ఎంఈ (ఉద్యం పోర్టల్‌లో నమోదు)

జిల్లా	ఉత్పత్తి	సేవారంగం	మొత్తం
కరీంనగర్	8,082	28,887	36,969
జగిత్యాల	4,861	14,997	19,858
పెద్దపల్లి	3,081	13,366	16,447
సిరిసిల్ల	3,557	9,721	13,278
మొత్తం	19,581	66,971	86,552

● రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) ఏటా 4.95 లక్షల టన్నుల యూరియా, 2.97 లోల టన్నుల అమ్మోనియా లక్ష్యంగా ఏర్పాటై ఫలితాల్నిస్తోంది. స్థానికులకు ఉపాధి మెరుగైంది.

● సిరిసిల్ల జిల్లా పెద్దూరు సమీపంలో 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్కులో కోట్లాది రూపాయల పనులతో ఉపాధి లభిస్తోంది. సూపర్‌హబ్‌గా పేరొందిన ఇక్కడి వస్త్రోత్పత్తికి మరింత తోడ్పాటు అందాలి.

సీతాఫలం అధరహో



సీతాఫలం చూడగానే నోరూరని వారు ఉండరు. మధుర ఫలాన్ని ఎంత ధర అయినా వెచ్చించి కొనుగోలు చేయాలని చూస్తారు. జగిత్యాల అంగడిబజార్ వద్ద సోమవారం చాలా మంది సీతాఫలాలను కొనుక్కునేందుకు వచ్చారు. ఒక్కో బుట్ట ధర రూ.250 కాగా కొందరు బేరమాడి కొనుగోలు చేశారు.

- చిత్రం: న్యూస్‌టుడే, జగిత్యాల

విద్యుత్తుశాఖలో బదిలీలు

నలుగురు ఏడీఈలతో కలిపి 235 మందికి స్థాన చలనం

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తుశాఖలో చాలా రోజుల తర్వాత భారీ స్థాయిలో బదిలీలు జరిగాయి. జిల్లాలోని నలుగురు ఏడీఈలు, 26 మంది ఏఈలతోపాటు మొత్తం 235 మందిని బదిలీ చేస్తూ విద్యుత్తు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో వీరంతా విధుల్లో చేరనున్నారు. వీరితోపాటు సబ్ ఇంజినీర్లు 25, జేఏవోలు 13 మంది మంది కూడా బదిలీ అయ్యారు. జగిత్యాల డివిజన్‌లో ఆఫీసు సబార్డినేట్‌లు ఏడుగురు, రికార్డు అసిస్టెంట్లు ఇద్దరు, సీనియర్ లైన్‌మెన్లు 8, సీనియర్ అసిస్టెంట్లు 15, లైన్ ఇన్‌స్పెక్టర్లు 15, లైన్‌మెన్లు 45 మంది ఉన్నారు. సహాయ లైన్‌మెన్లు 10, ఓఎస్‌లు ముగ్గురు బదిలీ అయినవారిలో ఉన్నారు. వీరితోపాటు మెట్‌పల్లి డివిజన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్లు 13 మంది, లైన్‌మెన్లు 30, ఎస్‌డబ్ల్యూజీలు ఇద్దరు ఉన్నారు. రెండున్నరేళ్లు ఒకే దగ్గర పని చేసిన వారిని బదిలీ చేశారు.

పేరు	హోదా	బదిలీ స్థానం
డి.హరీష్	ఏడీఈ జగిత్యాల రూరల్	జగిత్యాల
టి.సింధూర్ శర్మ	ఏడీఈ ధర్మపురి	జగిత్యాల రూరల్
పి.వరుణ్‌కుమార్	ఏడీఈ గొల్లపల్లి	అదే స్థానంలో ఉంచారు
కె.నగేశ్ కుమార్	ఏడీఈ టెక్నికల్ (జగిత్యాల)	ఏడీ ఆపరేషన్ బోధన్

కొత్త ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్

జగిత్యాల, న్యూస్‌టుడే: డీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండితులు పీఈటీ పోస్టులకు ఎంపికైన ఉదయం 10 గంటలకు, ఎస్జీటీ పోస్టుకు ఎంపికైన వారు మధ్యాహ్నం 1 గంట వరకు తమ ఒరిజినల్ నియామకపత్రంతో ధరూర్‌క్యాంపు టీచర్స్ భవన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలను జగిత్యాల డీఈవో.కాం వెబ్‌సైట్‌లో ఉంచామని ఉపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని హాజరు కావాలన్నారు.

కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కుల నీరు

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు సోమవారం 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా జిల్లాలోని జోన్-1, జోన్-2 ఆయకట్టు పంటలకు అందించనున్నారు. ప్రస్తుతం 8,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా వరదకాలువకు 2 వేల క్యూసెక్కులు, ఇతర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 8,590 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.



బస్సుల కోసం తప్పని నిరీక్షణ

పట్టణంలోని కొత్తబస్టాండు ప్రయాణ ప్రాంగణం ప్రయాణికులతో సోమవారం కిటకిటలాడింది. దసరా వేడుకల కోసం స్వస్థలాలకు వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు, బంధువులు తిరిగి వెళ్లేందుకు బస్టాండుకు చేరడంతో రద్దీ నెలకొంది. సరిపడినన్ని బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు.

– న్యూస్‌టుడే, జగిత్యాల విద్యానగర్

రైతేరాజు 6లో

పథకాల అమలుపై క్షేత్రస్థాయి పరిశీలన

జగిత్యాల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జాతీయస్థాయి మానిటరింగ్ సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మానిటరింగ్ సభ్యులతో వివిధశాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన ఉపాధి హామీ, సడక్ యోజన తదితర పథకాల తీరును పరిశీలిస్తారన్నారు. ఈనెల 20 వరకు జిల్లాలో 4 మండలాల్లోని 10 గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడుతారని అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని సహకరించాలని గౌతంరెడ్డి అన్నారు. మానిటరింగ్ సభ్యులు సుబ్రమణ్యం రెడ్డి, జయప్రకాష్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీటుకు అధికంగా మక్కలు

జగిత్యాల వాణిజ్యం: జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు సోమవారం 1,372 క్వింటాళ్ల మక్కలను విక్రయానికి తెచ్చారని మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మక్కలకు బీటులో క్వింటాలుకు కనిష్ఠంగా రూ.1,800 నుంచి గరిష్ఠంగా రూ.2,375, ఎంటీయూ-1010 రకం ధాన్యం రూ.1,810 చొప్పున ధరలు పలికాయని వివరించారు.

పడకలు.. పరికరాలు.. ప్లాంటు ఎప్పుడో?

ధర్మపురి ఆసుపత్రి సేవలపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, ధర్మపురి

ఓ వైపు ప్రముఖ పుణ్యక్షేత్రం, మరోవైపు నియోజకవర్గ కేంద్రం కావడంతో.. ప్రభుత్వం ధర్మపురిలో అత్యాధునిక వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఆసుపత్రిలోని సేవలపై నిఘా లేకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేసినా.. మార్పు లేదు. ప్రభుత్వం మాతాశిశు కేంద్రం నిర్మించినా.. వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు.

20 మంది మాత్రమే విధుల్లో..

ఇక్కడి సామాజిక ఆసుపత్రిలో గతేడాది 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా.. అత్యవసర సేవలు ఏమాత్రం ఉండటం లేదు. కుక్కకాటు, కోతులు దాడిచేసినా.. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారు. కనీసం ఎక్స్‌రేప్లాంటు, గర్భిణుల పరీక్షలకు సంబంధించిన పరికరాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వైద్యులతో కలిసి 53మంది పనిచేయాల్సి ఉండగా.. 20 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు చెబుతున్నారు.

పనిచేయని ఆక్సిజన్ ప్లాంటు..

రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రి మూడో అంతస్తు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరోనా సమయంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంటును గతేడాది ప్రారంభించినా.. సాంకేతిక లోపంతో పనిచేయడంలేదు. ఈ ఆసుపత్రి పరిధిలో ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలుండగా.. నిత్యం 150 మంది ఓపీ రోగులు వస్తుంటారు.

నేటికీ ప్రతిపాదనల్లోనే..

గతేడాది 10 ఐసీయూ బెడ్ల ప్లాంటును ధర్మపురి ఆసుపత్రికి మంజూరు చేశారు. ఇది ప్రతిపాదనల్లోనే ఉంది. రోగులకు రోజూ అందించే భోజనం నాసిరకంగానే ఉంటోందని రోగులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం కూడా అధ్వాన్నంగానే ఉంటోందని.. మధ్యాహ్నం వేళ వైద్యులు అందుబాటులో ఉండటం లేదని బాధితులు చెబుతున్నారు. ఆసుపత్రి సేవలపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ధర్మపురి సామాజిక ఆసుపత్రి

అందని మాతాశిశు కేంద్రం సేవలు..

ధర్మపురిలో గత ప్రభుత్వ హయాంలో రూ.8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆసుపత్రి కేంద్ర భవన సేవలు అందుబాటులోకి రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరాగా అక్టోబర్‌లో అప్పటి మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. రెండు నెలల్లో మిగతా పనులు పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తామని ప్రకటించినా.. ఇప్పటివరకు అతీగతి లేదు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తాం. ప్రస్తుతం వైద్యుల కొరత అంతగా లేదు. సిబ్బందిని కూడా నియమించాం. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం. వైద్యులు నిర్ణీత సమయం ప్రకారం ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఐసీయూ కేంద్రానికి కావాల్సిన పరికరాలు రావాల్సి ఉంది. మాతాశిశు ఆసుపత్రికి సిబ్బందిని నియమించలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతాం. **- డా.రామక్రిష్ణ, జిల్లా వైద్యవిధాన పరిషత్, సమన్వయకర్త**

ఉల్లి సాగు.. జాగ్రత్తలతో మేలు

న్యూస్‌టుడే, జమ్మికుంట





ఉల్లి సాగు

నిత్యం తీసుకునే ఆహార పదార్థాల తయారీలో ఉల్లి వినియోగం తప్పనిసరిగా ఉంటుంది. ఆరోగ్యరీత్యా మేలు చేసే ఉల్లిని రాష్ట్రవ్యాప్తంగా 70 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కుగాను అక్టోబరు నుంచి ఉల్లిని సాగు చేసుకోవచ్చు. రైతులు మొదటి నుంచి మెలకువలు పాటిస్తే లాభాలు ఉంటాయని **జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త జి. వేణుగోపాల్** చెబుతున్నారు.

ప్రతీ అడుగు కీలకమే..

ఉల్లిని వానాకాలం, యాసంగి, వేసవి.. ఇలా మూడు కాలాల్లో సాగు చేయవచ్చు. యాసంగి సాగును అక్టోబరు నుంచి డిసెంబరు వరకు చేపడతారు. ఎకరానికి 130 క్వింటాళ్ల నుంచి 160 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. విత్తనాలను నాటుకునే ముందు కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మావిరడి కలిపి లేదా 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ వినియోగించి విత్తన శుద్ధి చేసుకోవచ్చు. ముందుగా నారు మళ్లపై సన్నని గీతలు వేసుకొని వరుసలో విత్తనాలు వేసుకొని మట్టితో కలపాలి. నారుకుళ్ల తెగులు నుంచి పైరు కాపాడుకునేందుకు 10 రోజులకోసారి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మడులను తడపాలి. రసం పీల్చే పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుల అడుగు భాగంలో తెల్లమచ్చలు (మజ్జిగ తెగులు) ఏర్పడుతాయి. నివారణకు లీటరు నీటికి 2.మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

విత్తుకునే పద్ధతి

ఎకరం విస్తీర్ణంలో సాగుకు 3 కిలోల నుంచి 4 కిలోల విత్తనాలు అవసరం. నారు పెంపకానికి ఎత్తైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. పలువురు రైతులు సమతల మడుల్లో నారు పెంచుతున్నారు. దీంతో మురుగు వెళ్లే పరిస్థితి లేక నారుకు తెగులు సోకి చివరకు సరిపడ నారు లేక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. సమస్యను అధిగమించేందుకు ఎంచుకున్న పొలాన్ని 3 నుంచి నాలుగు సార్లు దున్నుకోవాలి. ఒక్కో నారుమడి 1 మీటరు వెడల్పు, 3 మీటర్ల పొడవు 15 సెం.మీ ఎత్తు ఉండేలా ఎత్తు మడులను ఏర్పాటు చేసుకోవాలి. 2 మడుల మధ్య అడుగు దూరం ఉండేలా చేసుకుంటే నడుస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. 50శాతం నీడనిచ్చే షేడ్ నెట్‌లను ఉపయోగిస్తే మొలక శాతం బాగుంటుంది.

రైతేరాజు

విత్తనాల్లో రకాలు

- రైతులు ఎరుపు, తెలుపు వర్ణాల ఉల్లి సాగుకు విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు.
- ఎరువు వర్ణం ఉల్లి విత్తనాల రకాల్లో బళ్లారి రెడ్, రాంపూర్ రెడ్, నాసిక్‌రెడ్, అగ్రిఫౌండ్ లైట్ రెడ్, పూసాలరెడ్, అర్కానికేతన్, అర్క కల్యాణ్, అర్క ప్రగతి, ఎన్-53లను ఎంపిక చేసుకోవచ్చు.
- తెలుపు వర్ణంలో పూసా వైట్ రౌండ్, పూసా వైట్ ఫ్లాట్ రకాలు అనుకూలం. ప్రైవేటు హైబ్రీడ్స్‌లో సెమినిస్ ఎక్స్‌పీహెచ్‌వోఎస్-3, తయోవైట్ తదితర రకాలు ప్రాచుర్యం పొందాయి.

విరులు.. లాభాల సిరులు

న్యూస్‌టుడే, కమాన్‌పూర్



బంతి తోటలో రాజమల్లు దంపతులు

మూస ధోరణి పద్ధతిలో పంటలను సాగు చేయకుండా విభిన్నంగా కొంతమంది రైతులు ఆలోచిస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సాగులో రాణిస్తున్నారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన రైతు మూగ రాజమల్లు తనకున్న 1.10 గుంటల భూమిలో బంతి పంటను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. 30 ఏళ్లుగా బంతి పంట సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎకరాకు రూ. 4 లక్షల ఆదాయం జూన్-జులై, అక్టోబరు-నవంబరు మాసాల్లో బంతి పంటను సాగు చేపడతారు. ఎకరాకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరాకు గతేడాది 72 క్వింటాళ్ల దిగుబడి (ఒక పంటకు) సాధించినట్లు రైతు తెలిపారు. క్వింటాకు రూ.4,000-4,500 వరకు మార్కెట్ ధర ఆధారంగా విక్రయిస్తారు. ఖర్చులుపోను ఎకరాకు రూ.2 లక్షలు, ఏడాదికి రెండు పంటలకు కలిపి రూ.4 లక్షలకుపైగా ఆదాయం పొందుతున్నారు. పండగలకు విడిగా కిలో రూ.80-100 వరకు అమ్ముతున్నారు.

సాగు ఇలా..: మొక్కలు నాటిన 100 రోజుల్లో బంతి పూలు కోయొచ్చు. సాగుకు కావాల్సిన విత్తనాలను కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి తీసుకు వస్తున్నారు. ఎకరాకు సుమారు 8 వేల మొక్కలు నాటుతారు. దుక్కుల నాటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడుతూ.. పంట కలుపు, పురుగు మందులు ఆశించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని ఏడాదిలో రెండుసార్లు సాగు చేస్తున్నారు.

పండ్ల తోటలకు ఏ నేలలు అనుకూలం?

మీకు తెలుసా?

పండ్ల తోటల సాగుకు అనువైన నేలలు, నీటివసతిగల వాటినే సాగుకు ఎన్నుకోవాలి. లోతైన ఎర్రగరప నేలలు, బాగా నీరింకే ఒండ్రునేలలు, మధ్యతరహా నల్లనేలలు, చెల్క నేలలు పండ్లతోటల సాగుకు శ్రేష్ఠమైనవి. సారవంతమైన మట్టిగల నేలలోతు కనీసం 5 అడుగులు ఉండాలి. మొదటి 5 అడుగుల్లో రాతిచట్టు, సున్నపురాయి తగలకూడదు. అన్ని సీజన్లలోనూ సగటు భూగర్భ జలమట్టం 6 అడుగుల దిగువనే ఉండాలి. బంకమన్ను 40 శాతానికి మించి, సున్నం 10 శాతానికి మించి ఉండరాదు- **న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం**

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం



జె.విజయ్, జమ్మికుంట కేవీకే

? వరి ముదురాకు చివరలో మధ్య ఈనెకు ఇరు పక్కల మచ్చలు కనబడుతున్నాయి. ఏం చేయాలి?
- ఈ.రమేశ్, వెంకట్రావ్‌పల్లి

✓ జింకు లోపం కారణం. లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

? **పత్తిలో పూత, పిందెలు, కాయలు రాలుతున్నాయి. నివారణ ఎలా? –తిరుపతి, మొగిలిపాలెం**

✓ ప్లానోఫిక్స్ ద్రావణాన్ని 5 లీటర్ల నీటికి 1 మి.లీ. వంతున కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, జమ్మికుంట

సామాజిక సేవ.. సాహసాలకు తోవ

పర్వతారోహణకు ఎంపికైన క్యాడెట్లు

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



గతేడాది పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు

విద్యార్థుల్లో చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలు, సేవాభావం, దేశభక్తి పెంపొందించాలి. అప్పుడే వారిలో దాగి ఉన్న ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది.. వారి జీవితానికీ బాటలు పరచుకుంటాయి. పాఠశాలలు, కళాశాలల్లో భారత సాయుధ దళాల యువ విభాగం నేషనల్ క్యాడెట్ కార్ప్ (ఎన్‌సీసీ), జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్)లు విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతున్నాయి. విద్యార్థులకు పలు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వారిలో సమాజ దృక్పథాన్ని పెంపొందిస్తున్నాయి. అందులో ఒకటి పర్వతారోహణ శిబిరం. శాతవాహన విశ్వవిద్యాలయ విద్యార్థులు మరో వారం రోజుల్లో ఆ శిబిరానికి వెళ్లనున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

22 నుంచి పది రోజులపాటు శిబిరం

శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 10 మంది చురుకైన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. వారిని ఈనెల 22 నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే అటల్ బిహారీ వాజ్‌పేయీ మౌంటెనింగ్ అండ్ అడ్వెంచర్ శిబిరానికి తీసుకెళ్లనున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు మైనస్ డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో ఉండాల్సి ఉంటుంది. పర్వతారోహణ, తాడు సహాయంతో లోయలు దాటడం, పర్వతాలు, కొండల్లో ప్రమాదాలు జరిగితే బాధితులను తరలించటం, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలు చేయడం తదితర అంశాలపై పది రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. గుడారాలు ఏర్పాటు చేసుకొని అందులోనే ఉంటూ వాలంటీర్లు ఈ శిక్షణలో పాల్గొననున్నారు.

మలావత్ పూర్ణే ప్రేరణ



మాది సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం బడి తండా. పదో తరగతి స్వగ్రామంలో, ఇంటర్ రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాను. చిన్నతనంలో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ ప్రేరణతో ట్రెక్కింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.
- మాలోత్ అనిల్, బీకాం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానం



జగిత్యాలలోని ధూంపేట గ్రామం మాది. నాన్న మోహన్‌రెడ్డి గల్ఫ్ కార్మికుడు. అమ్మ వ్యవసాయం చేస్తుంది. సెలవు రోజుల్లో నేను కూడా పొలం పనులకు వెళ్తుంటాను. కళాశాలలో చదువుతూనే ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సేవాభావం ఆకళింపు చేసుకున్నా. వాలంటీర్‌గా విశ్వవిద్యాలయం స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచా. శిబిరంలో పాల్గొనేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా.
- ఏ.అనూష, ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, జగిత్యాల

కోచ్ మాటలతో స్ఫూర్తి పొందా..




మాది సిరిసిల్ల జిల్లాలోని పొట్యాల గ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. ఎన్‌ఎస్‌ఎస్ కోచ్ వాణిశ్రీ మేడం మాటలతో స్ఫూర్తి పొందాను. ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్ల ఎంపిక పోటీల్లో విశ్వవిద్యాలయం స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పటి నుంచో పర్వతారోహణ చేయాలని అనుకునేదాన్ని. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. సద్వినియోగం చేసుకుంటాను. **- ఆర్.సంధ్య, బీఏ, టీటీడబ్ల్యూఆర్‌డీసీ(మహిళా), రాజన్న సిరిసిల్ల జిల్లా**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా



చదువుతోపాటు, ఆటలు, వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా. త్వరగా శిబిరానికి వెళ్లి మంచు పర్వతాలను ఎక్కేయ్యాలని ఉంది.
- కె.తులసిదాస్, బీఏ, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

విద్యార్థుల్లో సేవాభావం పెంపు



ఈ శిబిరానికి బృంద నాయకుడిగా వ్యవహరిస్తున్నాను. ఈ సాహస శిబిరంతో విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుంది. ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో తెలుస్తుంది. ధైర్య సాహసాలు పెంపొందుతాయి. జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన ఏర్పడుతుంది. పలువురికి సహాయం చేయాలనే దృక్పథం అలవడుతుంది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవటంతోపాటు దేశసేవలో ముందు వరుసలో ఉంటారు.
- పడాల తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, వృక్షశాస్త్రం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ఎల్ఎల్ఎం పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత ఆగస్టు నెలలో నిర్వహించిన ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నలుగురు అటవీశాఖ అధికారులపై వేటు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజర్ బి.అరుణ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై వేటుపడింది. ఈనెల 11న అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మైసమ్మ పూజ పేరుతో మందు విందు చేసుకోగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ రేంజర్‌ను సస్పెండ్ చేస్తూ బాసర సర్కిల్ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సి.సరవనన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు బీట్ అధికారి సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్, వాచర్ రహీంను జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్ విధుల్లోంచి తొలగించారు. మొత్తం నలుగురిపై చర్యలు తీసుకోగా పరారైన ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారి రాజశేఖర్, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి రవీందర్ సంఘటనపై పూర్తి విచారణ చేస్తున్నారు.

పత్తి గరిష్ఠ ధర రూ.6,960

జమ్మికుంట : నాలుగు రోజుల సెలవుల అనంతరం సోమవారం జమ్మికుంట మార్కెట్‌కు తక్కువగా పత్తి విక్రయానికి వచ్చింది. కేవలం 14 ట్రాలీల కొత్త విడిపత్తి మార్కెట్‌కు రాగా బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,200 గరిష్ఠంగా రూ.6,960 ధర పలికింది. 7 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,300 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

ఇద్దరు యువకుల దుర్మరణం



విక్కుర్తి దిలీప్



సూర అనిల్

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అతి వేగంతో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22), సూర అనిల్ (21) అనే ఇద్దరు స్నేహితులు. గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో రాత్రి వరకు సంతోషంగా గడిపారు. నిమజ్జనం అనంతరం దిలీప్ కొనుగోలు చేసిన నూతన ద్విచక్ర వాహనంపై సరదాగా కోనరావుపేట మండలం మామిడిపల్లి వైపు వెళ్లారు. అతివేగంగా వెళ్తున్న వీరి వాహనం హన్మాజీపేట శివారులో మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న సూర అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా, వాహనం నడుపుతున్న దిలీప్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి దిలీప్‌ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డిగ్రీ పూర్తి చేసిన దిలీప్ హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉండగా దసరా పండగకు ఇంటికి వచ్చాడు. అనిల్ ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం చేస్తుండేవాడు. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై మారుతి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దిలీప్ తండ్రి రాజేశం గల్ఫ్ వెళ్లగా తల్లి జూలి అంగన్‌వాడీ టీచర్. అనిల్ తండ్రి అంజయ్య గల్ఫ్ వెళ్లగా తల్లి లక్ష్మి వ్యవసాయం చేస్తుంది. కొత్త బండి మోజు తీరకముందే వెళ్లిపోయావా బిడ్డా అంటూ తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?

న్యూస్‌టుడే, వేములవాడ



వేములవాడ ఏరియా ఆసుపత్రి

మూడేళ్లుగా 'కాయకల్ప'కు ప్రాంతీయ ఆసుపత్రి ఎంపిక

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

ప్రకటించిన ప్రోత్సాహక నగదు వివరాలు

సంవత్సరం	ప్రకటించిన ప్రోత్సాహకం (రూ.లక్షల్లో)
2021-22	7
2022-23	7
2023-24	15

- సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర, ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భ సంచిలో గడ్డల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూ జరుగుతుంటాయి.
- సెప్టెంబరు 6న 24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు.
- ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది.

ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగపడతాయి

ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది.
– సంతోష్‌చారి, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

ఎంపిక విధానం ఇలా...

కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు.
- ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారు.
- వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని జులై 26న రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది.
- మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

వికటించిన వ్యాక్సిన్

◆ రెండుసార్లు శస్త్రచికిత్స చేయించుకున్నా మెరుగుపడని ఆరోగ్యం
◆ మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుల ఫిర్యాదు



వ్యాక్సిన్ వేసిన చోట ఏర్పడిన పుండు



బాధితులు చంద్రశేఖర్, రాకేశ్, రంజిత్‌కుమార్

కోరుట్ల, న్యూస్‌టుడే: గల్ఫ్ వెళ్లే క్రమంలో వైద్య పరీక్షల్లో భాగంగా వ్యాక్సీన్ వేయించుకోగా చేతికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాని పరిస్థితి నెలకొందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. . జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, మరో యువకుడు, మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన రాకేశ్ సౌదీ అరేబియా, బెహ్రెయిన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చంద్రశేఖర్‌కు సౌదీ వీసా రావడంతో నాలుగు నెలల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షల్లో భాగంగా కుడి చేతికి వ్యాక్సీన్ ఇచ్చారు. 20 రోజుల తర్వాత వ్యాక్సీన్ తీసుకున్న చోట గడ్డ ఏర్పడగా తగ్గిపోతుందని సౌదీ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పనిలో చేరాడు. తర్వాత కొద్దిరోజులకు వ్యాక్సీన్ తీసుకున్న చోట పుండు కావడంతో ఆసుపత్రికి వెళ్లినా నయం కాకపోగా శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. ఇండియాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కంపెనీ నిర్వాహకులను కోరగా అనుమతి ఇవ్వలేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఇండియా ఎంబసీలో దరఖాస్తు చేసుకున్నా పంపించలేదు. 5 వేల సౌదీ రియాల్‌లు తీసుకొని పంపించారు. 40 రోజుల కిందట సంగెంకు చేరుకున్న చంద్రశేఖర్ కోరుట్ల ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపాడు. సంగెంకు చెందిన రంజిత్‌కుమార్ బహ్రెయిన్‌కు, మోహన్‌రావుపేటకు చెందిన రాకేశ్ సౌదీ వెళ్లేందుకు జూన్ చివర్లో హైదరాబాద్‌లోని అదే మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయిచుకోగా వీరికి కూడా వ్యాక్సీన్ ఇచ్చారు. రెండు నెలల తర్వాత వ్యాక్సీన్ తీసుకున్న చోట ఇన్‌ఫెక్షన్‌సోకి గడ్డలాగా తయారైంది. వెంటనే కోరుట్లలోని ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకోగా నయమైంది. దీంతో వీరు గల్ఫ్ వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయారు. రెండు వారాల కిందట శస్త్రచికిత్స చేసిన చోట మరోమారు నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోలేదని మరోమారు శస్త్రచికిత్స చేయాలని సూచించడంతో వారం రోజుల కిందట రెండోసారి సర్జరీ చేయించుకున్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాలని ఆశపడితే మెడికల్ సెంటర్‌లో ఇచ్చిన వ్యాక్సీన్‌తో అనారోగ్యానికి గురై వెళ్లలేకపోయామని వాపోయారు. సోమవారం బాధితులు చంద్రశేఖర్, రంజిత్‌కుమార్, రాకేశ్ సదరు మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని తెలిపారు. సంబంధిత మెడికల్ సెంటర్ ఉన్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించినట్లు బాధితులు వాపోయారు. ఈవిషయమై సీఐ సురేశ్‌బాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాక్సీన్ తీసుకున్న మెడికల్ సెంటర్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించామన్నారు. అక్కడే ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించినట్లు పేర్కొన్నారు.

నిధులున్నా రహదారి నిర్మాణంలో నిర్లక్ష్యం



చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట వరకు రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.98 కోట్ల నిధులు 2022లో మంజూరు చేశారు. కానీ గుత్తేదారు నేటికీ నిర్మించలేదు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. రహదారి పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – **న్యూస్‌టుడే, చొప్పదండి**

దసరాకు..

మత్తు ఎక్కించారు

గతేడాదితో పోల్చితే రూ.27 కోట్లు అధికం

న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు



దసరా పండుగ నేపథ్యంలో ఈ ఏడాది మద్యం వ్యాపారం భారీగా జరిగింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది దసరా వేడుకలకు రూ.139 కోట్ల వ్యాపారం సాగగా, ఈ ఏడాది రూ.166 కోట్లు వ్యాపారం సాగిందని అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే రూ.27 కోట్ల అధికంగా జరిగిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన లక్ష్యం రూ.165 కోట్లు దాటిపోయింది. మొత్తం 292 మద్యం దుకాణాలతోపాటు 54 బార్ల ద్వారా విక్రయాలు జరిగాయి.

ఎక్కువగా కరీంనగర్‌లో..

జిల్లా	మద్యం దుకాణాలు	వ్యాపారం రూ.కోట్లలో
కరీంనగర్	94	46
పెద్దపల్లి	77	39
జగిత్యాల	63	41
సిరిసిల్ల	48	34

కరీంనగర్ కాకుండా పెద్దపల్లి జిల్లాలోని కార్మిక క్షేత్రం గోదావరిఖనిలో మద్యం వ్యాపారం ఎక్కువ సాగుతోంది. జనాభా ప్రాతిపదికన ఈ ప్రాంతాల్లో వ్యాపారం ఎక్కువగా ఉంటుందని అధికారులు భావించారు. ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 రోజుల ముందుగానే దసరా లక్ష్యాన్ని విధించి.. పూర్తి చేయాలని ఆదేశించింది. మద్యం దుకాణాల ద్వారా కాకుండా ఉమ్మడి జిల్లాలో ఉన్న 54 బార్ల ద్వారా మరో రూ.6 కోట్ల వ్యాపారం సాగింది.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

సమస్య: మక్కల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయరా.? **- గంగన్న, పోరండ్ల**

సమాధానం: మక్కలకు ప్రస్తుతం మద్దతు ధరకన్నా ధరలు అధికంగా పలుకుతున్నాయి. ధరతగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను కొనుగోలు చేస్తాము. **- శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ అధికారి**

– న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

సమస్య: కోరుట్ల పట్టణంలో చాలా కాలనీల్లో సిమెంట్ రోడ్లు దెబ్బతిన్నాయి. వాటిపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. **- శ్రీనివాస్, కోరుట్ల**

సమాధానం: దెబ్బతిన్న సిమెంట్ రోడ్లపై నూతన రోడ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే సీసీరోడ్ల నిర్మాణాలు చేపడతాం. **- తిరుపతి, కమిషనర్, - న్యూస్‌టుడే, కోరుట్ల**

సంఘాలు-కార్యవర్గాలు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం రామాలయ కల్యాణ మండపంలో 28 మందితో కూడిన నూతన కమిటీ మూడు సంవత్సరాలు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే డా.సంజయ్, ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లుంటారని తెలిపారు. నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా జెట్టి లింగం, చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, ఎర్రోళ్ల హన్మాండ్లయాదవ్, యామ రాజయ్య, మాన్కాల గంగాధర్‌లు, ప్రధాన కార్యదర్శిగా బల్గు కాశీరావు, జెట్టి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

శబరిమలకు పాదయాత్ర


మెట్‌పల్లి నుంచి కాలినడకన బయల్దేరిన అయ్యప్ప స్వాములు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 20 మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు సోమవారం కాలినడకన బయల్దేరారు. మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన గురుస్వామి పోతుగంటి రాజేందర్‌గౌడ్ ఏటా శబరిమలకు పాదయాత్రగా వెళ్తుంటారు. ఈ సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గణపతి హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిరిసిల్ల గురుస్వామి విద్యాసాగర్ అయ్యప్ప స్వాములకు ఇరుముడి ధరింపజేయగా పాదయాత్ర ప్రారంభించారు. సిరిసిల్ల, సిద్దిపేట, బెంగళూర్, సేలం మీదుగా సుమారు 1600 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి డిసెంబర్ 3న అయ్యప్ప స్వామి క్షేత్రానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకుంటామని తెలిపారు.

రాయికల్ పట్టణం: రాయికల్ పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి ముగ్గురు అయ్యప్ప దీక్షాపరులు సోమవారం శబరిమలకు మహా పాదయాత్ర ప్రారంభించారు. భూపతిపూర్‌కు చెందిన ముక్కెర నరేందర్, వడ్డెలింగాపూర్‌కు చెందిన యాచమనేని దీపక్, రామాజీపేటకు చెందిన మామిడిపల్లి లక్ష్మణ్ సోమవారం అయ్యప్ప మాల ధరించి పాదయాత్ర చేపట్టారు. సత్యనారాయణ శర్మ తదితరులున్నారు.

కూలిన వేదిక

మెట్‌పల్లి పట్టణం : బతుకమ్మ సంబరాల కోసం బల్దియా అధికారులు వేసిన వేదిక కూలడంతో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం రాత్రి కుల సంఘాలు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బల్దియా ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాట్ వద్ద ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. మహిళలు బతుకమ్మ ఆడి వేదికపై కూర్చోగా ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ విషయంపై బల్దియా కమిషనర్ మోహన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వీఐపీల కోసం వేసిన వేదికపై ఎక్కువ సంఖ్యలో కూర్చోవడంతో కూలిందని తెలిపారు.

గత ప్రభుత్వం రైతుల పొట్ట కొట్టింది


ప్రమాణస్వీకారానికి హాజరైన విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ధర్మపురి, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా మార్కెట్ పాలకమండలి వ్యవహరించాలని విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా లావణ్య, ఉపాధ్యక్షులుగా నర్సింహులు, పలువురు సభ్యులచే ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విప్ మాట్లాడుతూ.. రూపాయి పేరుతో గత ప్రభుత్వం పేద రైతుల పొట్ట కొట్టిందన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోళ్లవాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయించి రానున్న యాసంగి పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీరందిస్తామన్నారు. రానున్న కాలంలో లక్ష్మణ్‌కుమార్ మంత్రి అయ్యే అవకాశముందన్నారు. పుర అధ్యక్షురాలు సత్తెమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

కోరుట్లలో దారుణ హత్య

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం ప్రకాశం రోడ్డులో సోమవారం అర్ధరాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం.. ప్రకాశం రోడ్డుకు చెందిన బోయిని సాగర్(33)కు రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని యువకులతో స్వల్ప గొడవ జరిగింది. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి సాగర్ మెడపై కత్తితో దాడి చేసి పరారయ్యారు. సాగర్ తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ సురేష్ బాబు, ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై స్థానికులను విచారించారు.

యువకులను చితకబాదిన గ్రామస్థులు

కోరుట్ల : కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామంలో ఆదివారం రాత్రి పలువురు యువకులు గంజాయి తాగుతున్నారని సమాచారం రాగా అక్కడికి వెళ్లి వారిని చితకబాదారు. గ్రామశివారులోని శాఖ స్థలంలో తరచూ యువకులు గంజాయి తాగుతుండగా, ఆదివారం రాత్రి గ్రామం, పక్కగ్రామానికి చెందిన యువకులు గంజాయి తాగుతుండగా కొట్టినట్లు తెలిసింది. సోమవారం ఉదయం యువకుల కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆందోళనకు దిగారు. చాలా సేపు గ్రామపంచాయతీ వద్ద ఉండగా దాడికి పాల్పడిన వారు రాకపోవడంతో వెనుదిరిగారు. విషయం తెలిసి పోలీసులు గ్రామపంచాయతీ వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాధితుల ఆందోళన

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వాలని ఈ నెల 11న నిరసన దిగిన బాధితులు సోమవారం సాయంత్రం మెట్‌పల్లిలో మరోసారి ఆందోళన చేపట్టారు. పట్టణంలో వ్యాపారి వద్ద బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి అప్పు తీసుకోగా వాటిని విడిపించేందుకు తమ బంగారం ఇవ్వాలంటూ కొన్ని రోజులుగా వ్యాపారిని నిలదీస్తున్నారు. కాగా తాను ఓ పెద్ద వ్యాపారి వద్ద తాకట్టు పెట్టి అప్పులు ఇచ్చానని బాధితులకు తెలిపి వారిని 11న సదరు పెద్ద వ్యాపారి వద్దకు తీసుకెళ్లారు. ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదని బాధితులు ఆందోళనకు దిగారు. పోలీసులు సర్దిచెప్పి పంపించిన సంగతి విదితమే. నాలుగు రోజులు గడుస్తున్నా తమకు న్యాయం జరగడం లేదని, తమ బంగారం ఇవ్వాలంటూ బాధితులు మరోమారు పెద్ద వ్యాపారి వద్దకు వెళ్లారు. ఓ మహిళ పురుగు మందు డబ్బా చేత పట్టుకొని బంగారం ఇవ్వకుంటే ఆత్మహత్య శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సముదాయించి పంపించారు.

ధ్వజస్తంభ పునఃనిర్మాణానికి విరాళం

గొల్లపల్లి, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణ రామచంద్రస్వామి ఆలయ ధ్వజస్తంభం పునఃనిర్మాణానికి నవదుర్గ సేవా సమితి అధ్యక్షుడు రూ.50,016ను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రూపంలో సోమవారం అందజేశారు.


మల్యాల: బతుకమ్మ ఆడుతున్న మహిళలు


జగిత్యాల గ్రామీణం: మోతెలో..


రాయికల్: రామాజీపేటలో మహిళల ఉత్సాహం


కొనాపూర్‌లో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ జిల్లాలో సోమవారం బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లాలో ఏటా దసరా తర్వాత సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఆడపడుచులు బతుకమ్మలను ఆట పాటలతో తీసుకెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


కథలాపూర్: గంభీర్‌పూర్‌లో..


రాయికల్: వద్దెలింగాపూర్‌లో..


రాజారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కోరుట్ల మండలం అయిలాపూర్‌లో సందడి


వెల్లుల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మైతాపూర్‌లో భారీ బతుకమ్మ


ఆలూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


రామాజిపేటలో..


మెట్‌పల్లి పట్టణంలో..


కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లిలో..

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన కొడిమ్యాల శ్రీనివాస్‌కు శస్త్రచికిత్స నిమిత్తం రూ.36 వేల విలువగల సీఎం సహాయనిధి చెక్కు మంజూరు కాగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గోపి రాజరెడ్డి, తలారీ రాజేష్, సత్యనారాయణ, గరిపెల్లి శ్రీనివాస్, గంగమల్లయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రామానికి చెందిన సుతారి తిరుపతిరెడ్డి దుస్తులు అందజేశారు. గ్రామ నాయకులు తదితరులున్నారు.

అదనపు పీపీగా మల్లేశం

జగిత్యాల: జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.మురళీ పదవీ కాలం ముగియడంతో మొదటి అదనపు సెషన్స్ కోర్టు అదనపు పీపీ కె.మల్లేశంకు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జగిత్యాల, మెట్‌పల్లి అదనపు పీపీగా బాధ్యతలు కేటాయిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక తరలింపు అరికట్టాలని వినతి

కోరుట్ల: కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామశివారులోని వాగు నుంచి ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలంటూ తహసీల్దార్ వినోద్‌కు సోమవారం గ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. వాగులో ఇసుకను అక్రమంగా తవ్వి తీయడం వల్ల సమీపంలోని కుల సంఘ భవనం కూలిపోయే ప్రమాదం నెలకొందని తెలిపారు. రెవెన్యూ అధికారులు అక్రమ ఇసుక తరలింపు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు బోర్డులపై ఉర్దూలో రాయండి

మెట్‌పల్లి పట్టణం: వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల బోర్డులపై ఉర్దూలో రాయాలని అంజుమన్ ఇషాత్ ఎ ఉర్దూ నాయకులు డిపో మేనేజర్ దేవరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. అధ్యక్షుడు అజీజ్, ప్రధాన కార్యదర్శి ఖారీ, హసన్‌ఖాస్మి, మోఖిత్, షాహిద్, అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

కోరుట్ల: కోరుట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పలువార్డుల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకున్నట్లు కమిషనర్ తిరుపతి తెలిపారు. 15 వీధి కుక్కలను పట్టుకొని వాటిని ప్రత్యేక వాహనంలో ఏబీసీ కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్యాల: మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన అట్ల మహిపాల్‌రెడ్డి(40) ఆదివారం ధర్మారం మండలం కటికనపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తాటిపల్లిలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ఆలయంలోని క్యూలైన్లో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టులో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

మల్లాపూర్: మల్లాపూర్ మండలం సిరిపూర్ సహకార సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు గతంలో వేలం వేసిన భూములను దక్కించుకున్న రైతులకు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్ష పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సోమవారం సభ్యులు చెవులు, కండ్లు, నోరు మూసుకొని నిరసన చేపట్టారు. సమస్యలను పరిష్కరించేవరకు దీక్ష కొనసాగిస్తామని ఛైర్మన్ బద్దం అంజిరెడ్డి తెలిపారు.

మలేసియా బిజినెస్ సమ్మిట్‌కు కుస్తాపూర్ వాసి ఎంపిక

మల్లాపూర్ మలేసియా అంతర్జాతీయ బిజినెస్ సమ్మిట్‌కు మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన ప్రముఖ సైకాలజిస్ట్ అడ్డిగ శ్రీనివాస్ ఎంపికయ్యారు. జపాన్‌లోని ప్రముఖ ఎంగార్డ్ ఎనాజిక్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 21 వరకు మలేసియాలో జరిగే ప్రొడక్ట్, వ్యాపార నిర్వహణ రహస్యాల వర్క్‌షాప్‌కి ఎంపికైనట్లు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ, బిజినెస్ బిల్డింగ్ సీక్రెట్స్‌పై ఎమ్గార్డ్ ఎనాజిక్ సమ్మిట్ పేరుతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానం అందింది.

ప్రభుత్వ విప్‌ను కలిసిన దుంపేట గ్రామస్థులు

కోరుట్ల: కథలాపూర్ మండలం దుంపేట గ్రామస్థులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సోమవారం వేములవాడలో కలిసినట్లు తెలిపారు. రైతులు వరి, మొక్కజొన్న ధాన్యం ఆరబెట్టుకునేందుకు గ్రామశివారులోని వరద కాలువ భూమిని గత ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. కొందరు ఆ భూమిని ఆక్రమించుకుంటున్నారని, దీనిని రైతులకు ఉపయోగపడేలా చూడాలని ప్రభుత్వ విప్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

జగిత్యాల పట్టణం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్‌హాలులో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్య బృందం 160 మంది రోగులను పరీక్షించారు. ఇందులో నేత్ర శస్త్ర చికిత్స అవసరమైన 84 మందిని గుర్తించారు. తొలివిడతగా 40 మందికి సోమవారం రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపించారు. వినోద్‌కుమార్, డాక్టర్ మోర సుమన్, తాటిపాముల సురేష్, అంకం లక్ష్మణ్, రాచకొండ శ్రీనివాస్, శ్రీరాముల సుదర్శన్, శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించండి

జగిత్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి తాటిపర్తి శోభారాణి కోరారు. సోమవారం పీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. పెగడపల్లి జడ్పీటీసీగా బతికెపల్లి సర్పంచిగా గెలుపొందానని తన భర్త సైతం సర్పంచిగా, ఎంపీపీగా పనిచేశాడన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే మహిళా నేతగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు.

హోటల్ సీజ్

జగిత్యాల: జగిత్యాల తహసీల్ చౌరస్తాలో ఓ హోటల్‌ను ఆహార నియంత్రణ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఇడ్లీలో జెర్రి వచ్చిందన్న ఫిర్యాదు మేరకు హోటల్‌ను ఆహార నియంత్రణ అధికారి తనిఖీ చేశారు. కేసు నమోదు చేసి హోటల్‌ను సీజ్ చేశారు.

డిగ్రీ కళాశాలల బంద్

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో నిరసన చేపట్టిన ప్రైవేటు డిగ్రీ కళాశాలలు నిరవధికంగా బంద్ పాటిస్తున్నాయి. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోని డిగ్రీ కళాశాలలన్నీ మూసివేసినట్లు యాజమాన్యాలు ప్రకటించాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే వరకు కళాశాలలు తెరవబోమని డిగ్రీ కళాశాలల జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు.

గ్రంథాలయ ప్రారంభోత్సవం

మేడిపల్లి : మేడిపల్లి మండలం వల్లంపల్లిలో సోమవారం అబ్దుల్ కలాం జ్ఞాన వేదికను ప్రారంభించారు. దాతల సహకారంతో మన ఊరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామం నుంచి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన సంపతి రాజ్‌కుమార్, గౌరీ అనుప్రియ, దొడ్డి రవీనా, సందెల గణేష్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. వెల్మ నవీన్ రెడ్డి, ప్రత్యేకాధికారి ఆనంద్, సమత, నాయిని మమత, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


2010-2011 పూర్వ విద్యార్థులు

బుగ్గారం, న్యూస్‌టుడే: మద్దునూరులో సోమవారం 2010-2011 సంవత్సరానికి చెందిన పదో తరగతి బృందం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను సన్మానించారు.

కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

జగిత్యాల, న్యూస్‌టుడే: పౌర హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఆయన మృతి పట్ల సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. 90 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్న సాయిబాబాను మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్టు చేసి పదేళ్లు జైలులో ఉంచారని సకాలంలో వైద్యం అందకపోవడంతో ఆరోగ్యం క్షీణించిందన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో వరంగల్ సభ నిర్వహణలో కీలకంగా పనిచేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి బాధిత కుటుంబంలో ఒకరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

కొడిమ్యాల: మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి-వనజారెడ్డి దంపతులు రూ.1,01,116ను ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

క్రైం కార్నర్

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్‌లోని రైల్వే వంతెన సమీపంలో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన అహ్మద్ అఫ్సర్(23) కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడం, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం కోరుట్లలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం బాగుపడటం లేదని మనోవేదనకు గురై పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లోని రైల్వే వంతెన దగ్గర్లో రాత్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి షేక్ ముస్తాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

పెగడపల్లి: మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన బండి తిరుపతి(43) సోమవారం ఉదయం మామిడితోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. మూడేళ్లుగా వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న తిరుపతి.. మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అత్తింటి వద్ద అల్లుడి వీరంగం

కోరుట్ల: భార్యను కాపురానికి పంపడం లేదంటూ ఆదివారం రాత్రి అత్తింటి వద్ద అల్లుడు వీరంగం సృష్టించిన ఘటన కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోరుట్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి దగ్గరి బంధువైన కథలాపూర్ మండలంలోని గ్రామానికి చెందిన యువకుడితో సుమారు 8 ఏళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి ముగ్గురు సంతానం. నెల రోజుల కిందట యువతి తల్లిగారింటికి వెళ్లింది. భార్యను తన ఇంటికి పంపించాలని చెప్పినా వారు పంపించలేరు. దీంతో ఆదివారం రాత్రి అత్తింటికి చేరుకొని గొడవకు దిగాడు. చాలాసేపు ఇంటి వద్ద వీరంగం సృష్టించాడు. బయటున్న ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. చుట్టు పక్కల వారు గొడవ ప్రారంభమైన వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఆలస్యంగా సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పోలీసులు సకాలంలో స్పందిస్తే గొడవ పెద్దగా జరగకుండా ఉండేదని తెలిపారు. అనంతరం సదరు యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

గుర్తు తెలియని కారు ఢీకొని తీవ్ర గాయాలు

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణ శివారులోని వెంకట్రావుపేట పెట్రోల్‌బంక్ సమీపంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో అర్బన్‌కాలనీకి చెందిన సబ్బాని శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై శ్రీనివాస్ అర్బన్‌కాలనీకి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

పెగడపల్లి: మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి శివారులో ప్రధాన రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన అలువాల విష్ణు అతని భార్య రమ్యకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై రవికిరణ్ తెలిపారు. పెగడపల్లిలో లేడీస్ ఎంపోరియం నడుపుతూ జీవించే ఆ దంపతులు.. పండగకు తమ గ్రామానికి వెళ్లి తిరిగి ద్విచక్రవాహనంపై పెగడపల్లికి వస్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. రమ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం మారుతినగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. కోరుట్ల వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా ఈ ఘటనలో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడడంతో ప్రమాదం తప్పినట్లయింది.

కేసు నమోదు

జగిత్యాల గ్రామీణం: జగిత్యాల గ్రామీణ మండలం పోరండ్లకు చెందిన ఆరె తిరుపతిపై అదే గ్రామానికి చెందిన మర్రిపెల్లి సాయినాథ్, చందు అనే వ్యక్తులు దాడి చేయటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొడిమ్యాల: కొడిమ్యాల గ్రామశివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్ఐ వి.కరుణాకర్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా భూమి సర్వే పని నిమిత్తం కొడిమ్యాల గ్రామశివారులోకి వెళ్లగా అటుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించారని, ఆర్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసునమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఏడుగురికి రిమాండు

మల్యాల: ఓబులాపూర్ గ్రామంలో ఈనెల 12న అర్ధరాత్రి మనోహర్ అనే యువకుడిపై కత్తితో దాడి చేయడంతోపాటు మహేష్, దినేష్ అనే వ్యక్తులపై దాడిచేసి గాయపర్చిన 8 మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఉదయ్, చక్రి, రాజు, దినేష్, విష్ణు, రాజేశ్, రాకేష్ అనే యువకులను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామని, మరో నిందితుడు గణేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్సై వివరించారు.